ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

- కృతజ్ఞత ర్యాలీలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీనివాస్

రుద్రవరంలో తెప్పెల పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జనవరి 13: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వేములవాడ మండలం చింతల్‌ఠాణా, ఆరెపల్లిలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడారు. తన విజయానికి అహర్నిశలు కృషి చేసిన గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని, గతంలో పోరాటం చేశామని గుర్తుచేశారు. ఇక్కడి సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉన్నదని, తప్పకుండా ముంపు గ్రామాల ప్రజలకు అండగా ఉంటామన్నారు. మీ దయతో ఎన్నికల్లో గెలిచానని, ఈ పదవీని ప్రజలకు అంకితం చేస్తానన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం మొదటగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిందని తెలిపారు. కాగా ప్రభుత్వవిప్‌ను ఘనంగా సన్మానించారు.

తెప్పెల పోటీలు ప్రారంభం

రుద్రవరంలో ముదిరాజ్ మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తెప్పెల పోటీలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిడ్‌మానేరులో తెప్పెల పోటీలు నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రాచారి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కనుకయ్య, సర్పంచులు రాంరెడ్డి, నవీనరాజు, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణదేవరావు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట, జనవరి 13: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు 7,8,9,10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కంకణాల సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధించిన ఫారాన్ని పాఠశాలలో సమర్పించాలన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీఆర్వోకు అభినందన

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: నారాయణపూర్‌కు చెందిన బొల్లం శ్రీనివాస్ ఇటీవల సీఎం పీఆర్‌వోగా నియమితులైన సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని శ్రీనివాస్ స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఇక్కడ బుగ్గ కృష్ణమూర్తి, పాముల స్వామి, ప్రభాకర్‌రెడ్డి, గంట రవీందర్‌గౌడ్, షకీల్ ఉన్నారు.

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు
- తంగళ్లపల్లిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ మానస

సిరిసిల్ల రూరల్, జనవరి 13: క్రీడలతోనూ యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. ఈమేరకు తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేత, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీపీఎల్ సీజన్ -3 క్రికెట్ టోర్నీని ఎంపీపీ పడిగెల మానసతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. సరదాగా బ్యాటింగ్ చేసి అలరించారు. అనంతరం వారు మాట్లాడారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయని, పోరాట స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని క్రికెట్ టోర్నీలు నిర్వహించడం అభినందనీయమని అంతయ్యను అభినందించారు. కార్యక్రమంలో పడిగెల రాజు, రాపెల్లి ఆనందం, కురుమ సంఘ మండలాధ్యక్షుడు ఎగుర్ల కర్ణాకర్, నవీన్‌రెడ్డి ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: రాజన్నపేటలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరాన్ని ప్రారంభించినట్లు పీవో వాసరవేణి పరశురాం తెలిపారు. శనివారం ఎన్ఎస్ఎస్ శిబిరం ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. అలాగే గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఇక్కడ సర్పంచ్ ముక్క శంకర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి

కోనరావుపేట, జనవరి 13: 28 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న 15వేల మంది ఫారాలను ఆన్‌లైన్ చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఈ దరఖాస్తులను ఇంటింటా తిరుగుతూ పరిశీలిస్తామని వెల్లడించారు.


రుద్రంగిలో హనుమాన్ ఆలయంలో అయోధ్య అక్షింతలను గ్రామస్తులకు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ, నాయకులు

రాములోరి అయోధ్య అక్షింతల పంపిణీ

రుద్రంగి/ఇల్లంతకుంట/సిరిసిల్ల రూరల్, జనవరి 13: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అందించిన అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ అక్షింతలను శనివారం రుద్రంగి, ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లెలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ భక్తులు మాట్లాడారు. అయోధ్య అక్షింతల పంపిణీకి గ్రామంలోని భక్తులు, మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి అక్షింతలను స్వీకరించాలని కోరారు. అయోధ్యలో ఈనెల 22న నిర్వహించే శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ అనంతరం అక్షింతలను ఆశీర్వచనంగా తీసుకోవాలని సూచించారు. మూడు రోజుల పాటు అక్షింతలు పంపిణీ చేస్తామన్నారు. రుద్రంగిలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, నాయకులు మాడిశెట్టి అభిలాష్, నంద్యాడపు వెంకటేష్, రాసురి నర్సారెడ్డి, మంచె రమేశ్, మాడిశెట్టి ప్రభాకర్, కోటగిరి శ్రీనివాస్, పెద్దలింగాపూర్‌లో సర్పంచ్ గొడిసెల జితేందర్‌గౌడ్, నాయకులు కరుణాకర్ రెడ్డి, ఎద్దు కుమార్, నర్సింహులపల్లెలో మంద కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి కల్యాణం

గంభీరావుపేట/కోనరావుపేట/చందుర్తి, జనవరి 13: గంభీరావుపేటలోని సీతారామాలయం, కోనరావుపేట మండలం కొండాపూర్ గుట్టపై కొలువుదీరిన గోదా రంగనాథస్వామి ఆలయం, సుద్దాలలోని చెన్న కేశవ ఆలయం, చందుర్తి మండలం బండపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గోదా రంగనాథస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు అర్చకులు కల్యాణం జరిపించారు. మహిళలు మంగళహారతులతో స్వామి వారిని దర్శించుకుని ఓడి బియ్యం సమర్పించారు. భక్తులకు అన్న ప్రసాదం అందించారు. గంభీరావుపేటలో కల్వకుంట్ల రాజేశ్వర్‌రావు-వజ్రమ్మ దంపతులు, సర్పంచ్ మల్యాల దేవయ్య, ఆలయ కమిటీ చైర్మన్ వికృతి రవీందర్‌గౌడ్, బండపల్లి అర్చకుడు కొదమగుళ్ల శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి కల్యాణంలో పాల్గొన్నారు.

చందుర్తి: స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వసతి సౌకర్యాలను మెరుగుపర్చండి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 13: వేములవాడ రాజన్న సన్నిధికి వచ్చే నిరుపేద, మధ్య తరగతి కుటుంబీలకు కావాల్సిన వసతి సౌకర్యాలను మెరుగుపర్చాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్‌తో కలిపి రాజన్న ఆలయ ఉద్యోగుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజన్న ఆలయ అభివృద్ధిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. సమ్మక్క-సారలమ్మ, మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. సామాన్య భక్తులకు విడిది కోసం మాస్టర్ ప్లాన్‌కు ఇబ్బంది కలగకుండా గుడి చెరువులో షెడ్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. అవసరమైన ప్రతిపాదనలు పంపితే, శాఖపరమైన అనుమతులు ఇస్తామని కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు. సమావేశంలో ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేశ్, ఏవోలు హరికిషన్, జయకుమారి, నవీన్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, డీఈలు రఘునందన్, రామేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకున్న ఘటన కోరుట్లపేటలో శనివారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రంగు దేవగౌడ్(45) కొన్నేళ్ల క్రితం ముంపు గ్రామమైన చింతల్‌ఠాణా నుంచి కోరుట్లపేటకు బతుకుదెరువు కోసం వచ్చి స్థిరపడ్డాడు. చేసేందుకు పనిలేక అప్పులు ఎక్కువై మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఇరుగు పొరుగువారు, కుటుంబసభ్యులతో తగాదాలు పెట్టుకుంటున్నాడు. కుటుంబసభ్యులతోనూ సరైన సంబంధాలు లేక పోవడంతో ఒంటరిగా భావించి మనస్తాపానికి లోనై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. దేవగౌడ్ భార్య బాలమణి, కూతురు సౌమ్య, కొడుకు అజయ్ ఉన్నారు.

హన్మాండ్లును పరామర్శించిన కొండూరి

పర్శ హన్మాండ్లు తండ్రిని పరామర్శిస్తున్న రవీందర్‌రావు

సిరిసిల్ల, జనవరి 13: రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లును నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. సిరిసిల్లలో హన్మాండ్లు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. హన్మాండ్లు తండ్రి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను హన్మండ్లును అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యపరంగా జాగ్రత్త తీసుకోవాలని రవీందర్‌రావు సూచించారు.

పుట్టిన ఊరికి సేవలోనే సంతృప్తి

దుమాలలో వేదికపై మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ శివారెడ్డి

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎంత ఎత్తుకు ఎదిగిన, ఎక్కడ స్థిరపడ్డా పుట్టిన ఊరిని మరిచిపోకుండా సేవ చేయడంలోనే నిజమైన తృప్తి ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు, డియా ప్రెసిడెంట్ బద్దిపడిగె శివారెడ్డి అన్నారు. శనివారం దుమాలలో డియా (దుమాల ఎంప్లాయీస్ అసోషియేషన్) దశాబ్ది ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ఉద్యోగులందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న సంఘం ఆధ్వర్యంలో పాఠశాల, గ్రామాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేసినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఇప్పటి వరకు పనిచేసిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇక్కడ వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్, సర్పంచ్ కదిరె రజిత, ఉద్యోగులు ఉన్నారు.

రాజన్న సన్నిధిలో ప్రముఖులు

కుటుంబసభ్యులతో కలిసి కోడెమొక్కు చెల్లించుకుంటున్న సీబీఐ ఎస్పీ

వేములవాడ టౌన్, జనవరి 13: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్ కుటుంబ సమేతంగా, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి దంపతులు, శాతవాహన వైస్ చాన్స్‌లర్ మల్లేశం దంపతులు, సీఐడీ ఎస్పీ రామ్‌రెడ్డి కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వీరికి ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కమిషనర్ అనిల్ కుమార్‌కు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. స్వామివారి ప్రసాదాన్ని ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో ఈఈ రాజేశ్, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ప్రతాప్ నవీన్, జయ కుమారి, డీఈ రఘునందన్, పర్యవేక్షకులు శ్రీరాములు, అల్లి శంకర్ ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

గంభీరావుపేట, జనవరి 13: మండల కేంద్రంలోని కేజీ టు పీజీ క్యాంపస్ డిగ్రీ కళాశాలలో శనివారం సంక్రాంతిని పురస్కరించుకుని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా ముగ్గులు వేసిన విద్యార్థినులకు బహుమతులను ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అందించారు.

ముగ్గులను పరిశీలిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మున్సిపాల్ చైర్‌పర్సన్ జిందం కళ

శ్రీనగర్ కాలనీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

సిరిసిల్ల టౌన్, జనవరి13: జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కాలనీలోని మహిళలు భారీ సంఖ్యలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లీలా శిరీష, డాక్టర్ శోభారాణి, నిర్వాహకులు జంగిటి రాజు, పాములు దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామానికి దారేది

దారిలేని అనంతపల్లి వైకుంఠధామం

చందుర్తి, జనవరి 13: అనంతపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైకుంఠధామం కనీస సౌకర్యాలు లేక నిరాదారణకు గురవుతున్నది. గత వానకాలంలో కురిసిన వర్షాలతో వైకుంఠధామానికి వెళ్లే తోవ కోతకు గురైంది. ఈ క్రమంలో వైకుంఠధామం ఎదుట మట్టికుప్ప పోశారు కానీ చదును చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలనిగ్రామస్తులు కోరారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చందుర్తి, జనవరి 13: కేసీఆర్ కప్ పేరుతో ఉమ్మడి జిల్లా ఆహ్వానిత వాలీబాల్ టోర్నమెంట్ నేపథ్యంలో శనివారం క్రీడా దుస్తులను బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జి ఈర్లపల్లి రాజు అందజేశారు. ఈనెల 16, 17న మల్యాలలో టోర్నమెంట్ జరుగనుండగా మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవనున్నారు. ఈ క్రమంలో మల్యాల వాలీబాల్ జట్టు క్రీడాకారులకు దుస్తులను అందజేశారు. ఇక్కడ సర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ, వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న ఈర్లపల్లి రాజు

నాడు మహామునిపల్లె.. నేడు మామిడిపల్లి

మామిడిపల్లిలోని ప్రాచీన శ్రీసీతారామస్వామి ఆలయం

కోనరావుపేట, జనవరి 13: కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి గ్రామం గతంలో మహామునిపల్లె అనే నామకరణంతో ఉండేదని పెద్దలు చెబుతున్నారు. ప్రాచీన కాలంలో రాములవారి గుట్టపైన గల రాతి గుండుపై మహా మునికూర్చుండి కొద్దికాలం తపస్సు చేయడంతో పాటు అక్కడే కొన్ని రోజులు సేదతీరాడట. దీంతో గ్రామం ముహామునిపల్లిగా పేరొందింది. కానీ కాలక్రమేణా మహామునిపల్లె నుంచి మామిడిపల్లిగా పేరుగాంచింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం

వేములవాడ, జనవరి 13: ప్రజా సమస్యలే ధ్యేయంగా పోరాటాలు చేస్తూ ప్రజల పక్షాన నిలుస్తున్న సీపీఐ మరింత బలోపేతంగా ముందుకు సాగుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో ఉంటామని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు అన్నారు. శనివారం వేములవాడలో సభ్యత్వ నమోదు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో దళితులు, పేదలకు ఇచ్చిన భూములను అధికారులు లాక్కున్నారని వెంటనే వాటిని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి దేవరాజు, రూరల్ మండల కార్యదర్శి నర్సయ్య, అనిల్, రవీందర్ ఉన్నారు.

కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో కంపోస్టు షెడ్డు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

కంపు కొడుతున్న కంపోస్టు షెడ్స్

- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందిపడుతున్న గ్రామస్తులు
- సమస్యను పరిష్కరించాలని విన్నపం

తడి, పొడి చెత్తను శుద్ధిచేసి సేంద్రియ ఎరువులుగా తయారు చేసేందుకు గానూ కేసీఆర్ ప్రభుత్వం ఊరూరా కంపోస్ట్‌షెడ్‌లు నిర్మించింది. ప్రతిరోజూ జీపీ ట్రాక్టర్ల సాయంతో సేకరించిన చెత్తను షెడ్ల ముందు పారబోస్తున్నారు. ప్రస్తుతం షెడ్లు నిరుపయోగంగా ఉండడంతో చెత్తాచెదారం పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. గాలికి చెత్త రోడ్లపైకి కొట్టుకురావడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

– కోనరావుపేట, జనవరి 13

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★Residential Plot 2250 Sq. yards for Sale in Prime Residential Area at Near SRR College, Jagityal Road, Karimnagar Town. Ph: 9703544199.
NT-319319
OWN BUSINESS OFFER
★18-28 సం॥ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603.
NT-2580-All
బిల్డింగ్ అమ్మబడును
★కరీంనగర్‌లోని కొత్త యాస్వాడ హరిహర రోడ్ నెంబర్.2 గ్రౌండ్ ఫ్లోర్ ఓపెన్ ఫస్ట్ ఫ్లోర్ 2BHK ఉత్తరం ఫేసింగ్. 30 ఫీట్ రోడ్డు. గల బిల్డింగ్ అమ్మబడును. సంప్ర॥ సెల్: 9848034203.
NTK-317328
డాక్యుమెంట్ పోయినది
★తొగరు దేవయ్య S/o భూమయ్య, H.No. 4-79, 2-1-2024 రోజున దమ్మన్నపేట నుండి మేడిపల్లికి బైక్‌పై వెళ్లుతుండగా నాయొక్క భూమి డాక్యుమెంట్ నెం. 3434/2009 గలది పోయినది. దొరికిన వారు సంప్ర॥ 99592 89675.
NTK-316879
NAME CHANGE
★VASAM MUKTHAVALI , W/O. VASAM PRAVEEN , H.No. 6-8-44/1, Subhashnagar, Sircilla Town Rajanna Sircilla Dist T.S. my surname as changed VADDEPALLY MUKTHAVALI W/O VASAM PRAVEEN.
NTK-317627
CHANGE OF NAME
★I, YENUGANTI SHUDHESHNA, D/o. Yenuganti Baburam, R/o. 4-1-460, Adarsha Nagar, Korutla Dist., Jagtiyal, TS. Changed My Name as YENUGANTI SUDHESHNA, D/o. Yenuganti Baburam.
NT-319335
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194